క్లుప్తంగా

సబ్సిడీ నిధులు విడుదల చేయాలని వినతి

కైలాస్‌నగర్: ట్రైకార్ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.265 కోట్ల ట్రైకార్ సబ్సిడీ నిధులను విడుదల చేసి కొత్త యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించాలన్నారు. 32,122 లబ్ధిదారులకు ట్రైకార్ సబ్సిడీ రుణాలను చెల్లించాల్సి ఉందని, వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మేస్రం భాస్కర్, చాకటి కిరణ్, గేడం పాచ్చిరాం, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



ఓటరుగా నమోదు చేస్తున్న నాయకులు

బోథ్: డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లుగా నమోదు చేసుకోవాలని బీజేపీ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి బొడ్డ సత్యప్రకాశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఓటరు నమోదు హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2019లో ఓటుహక్కు ఉన్న వారు కూడా మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. హెల్ప్‌లైన్ కేంద్రాన్ని గ్రాడ్యుయేట్స్ వినియోగించుకోవాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోరె రవీందర్, నాయకులు సుభాష్ సూర్య, కచ్చకాయల హరీశ్, రాజేశ్వర్‌లు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ధనత్రయోదశి సందర్భంగా మంగళవారం ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆయుర్వేద వైద్య శాలలను ప్రారంభించారు. ఆయుర్వేదం గురించి వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా వైదారోగ్య శాఖ అధికారి కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీధర్, డీపీఎం వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కుమురంభీం విగ్రహావిష్కరణ

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో బుధవారం కుమురం భీం విగ్రహావిష్కరణ చేయనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు మడావి లింబాజీ తెలిపారు. ఉదయం 11 గంటలకు కుమురం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎంపీ నగేశ్‌తో పాటు పలువురు హాజరవుతున్నట్లు తెలిపారు.

దండారీ ఉత్సవాలకు ప్రభుత్వం ఆర్థికసాయం

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి దండారి ఉత్సవాల కోసం రూ.15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. దండరీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని వాగ్దారి, ఇస్రుగూడ గ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, అబ్దుల్ అజీమ్, గంగారాం, మురళి, మారుతి, రామారావు, సురేందర్, రమేశ్, లక్ష్మణ్, గణేశ్, గ్రామ పటేలు, మహాజన్, పూజారి, గ్రామస్తులు ఉన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాల (బోథ్)ను మంగళవారం నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం సభ్యులు సందర్శించారు. దేశ వ్యాప్తంగా కళాశాలల్లో నాణ్యత ప్రమాణాలపై ఇచ్చే గుర్తింపు ప్రక్రియలో భాగంగా సభ్యులు రెండు రోజుల పాటు పర్యటించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న తెలిపారు. బోధన పద్ధతులు, సౌకర్యాలు, వసతులు, రికార్డులు, విద్యా ప్రమాణాలను పరిశీలించినట్లు ఆమె పేర్కొన్నారు. కళాశాలకు గ్రేడ్ కేటాయించేందుకు నివేదికను సీల్డ్ కవర్‌లో బెంగళూరులోని న్యాక్ కేంద్ర బృందానికి పంపించినట్లు తెలిపారు. ఈ బృందంలో న్యాక్ ప్రొఫెసర్లు ప్రతాప్‌జ్యోతి, జయరాజ్, అమిన్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.



ఇంద్రవెల్లి: ఏత్మసూర్ దేవతలకు పూజలు చేస్తున్న కోలయ్‌పాండ్రి గ్రామస్తులు



నార్నూర్: మాన్కాపూర్‌లో సంప్రదాయ నృత్యం చేస్తున్న గుస్సాడీలు



ఇంద్రవెల్లి: సంప్రదాయ నృత్యం చేస్తున్న హీరాపూర్ గ్రామ దండారీ బృందం

ఘనంగా దండారీ ఉత్సవాలు

దీపావళి పండుగ సందర్భంగా గిరి పల్లెల్లో దండారీ సందడి నెలకొంది. భోగి పూజతో ప్రారంభమైన దండారీ ఉత్సవాలు కొలబోడి వరకు కొనసాగనున్నాయి. ఆదివాసీ గిరిజనుల సంప్రదాయ భేటిలో భాగంగా మంగళవారం నార్నూర్ మండలం ఖైర్‌డట్వా గ్రామానికి చెందిన దండారీ బృందం మాన్కాపూర్ గ్రామానికి వచ్చి దండారీ ఆడారు. కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన దండారీ బృందం ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించారు. నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు తయారు చేసి నాగోబాకు సమర్పించారు. ఇంద్రవెల్లి మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో దండారీ ఉత్సవాలను ఆదివాసీలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని హీరాపూర్ గ్రామానికి చెందిన దండారీ బృందం మండలంలోని కోయల్‌పాండ్రి గ్రామానికి అతిథులుగా వెళ్లారు. బజార్‌హత్నూర్ మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాలు చింతలసాంగి, మడగూడ, ఉప్పర్‌పల్లి, భూతాయి, దేగ్ర, గిరిజయ్, జాతర్లలో దండారీ ఉత్సవాలు నిర్వహించారు. బోథ్ మండలంలోని పార్డి కె గ్రామానికి మహారాష్ట్రలోని పటోద, మార్కగూడ గ్రామానికి చెందిన దండారీలు చేరుకున్నాయి.

– నార్నూర్/ఇంద్రవెల్లి/ బజార్‌హత్నూర్/బోథ్



బోథ్: దండారీకి స్వాగతం పలుకుతున్న పార్డికె గ్రామస్తులు



నార్నూర్: దండారీలో భాగంగా నాటిక ప్రదర్శిస్తున్న గిరిజనులు



ఇంద్రవెల్లి: నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న పిప్రి గ్రామ దండారీ బృందం



బజార్‌హత్నూర్: చింతలసాంగిలో దండారీ ఉత్సవాలలో పాల్గొన్న గిరిజనులు

నిరుపయోగంగా డంపింగ్‌యార్డులు

- తడి, పొడి చెత్త సేకరణలో అలసత్వం
- ఇష్టారీతిగా పడేస్తున్న సిబ్బంది
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



నిరుపయోగంగా మండలకేంద్రంలోని డంపింగ్ యార్డు

నార్నూర్: గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తడి, పొడి చెత్త సేకరణ పెద్ద సమస్యగా తయారైంది. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. చాలా యార్డుల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా కాకుండా ఇష్టారీతిగా పడేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకున్న లక్ష్యం నీరుగారుతోంది.

పర్యవేక్షణ లోపం..

చెత్తను సేకరించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్లను కేటాయించారు. ఇందుకు సిబ్బందిని సైతం నియమించారు. సిబ్బంది తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. కానీ రెండు కలిపి ట్రాక్టర్‌లో పడేస్తున్నారు. దాన్ని డంపింగ్ యార్డుల్లో కుప్పగా పోసి అలాగే వదిలేస్తున్నారు. మండలంలో కొన్ని యార్డులను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో పర్యవేక్షణ లోపించింది. వీటిల్లో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. నార్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన డంపింగ్ యార్డు ఏకలవ్య, ఆదర్శ పాఠశాలలకు చెందిన భూమిలో నిర్మించడంతో డంపింగ్ యార్డును తీసేసి బాలికల వసతి గృహాన్ని నిర్మించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ఎంపల్లి వెళ్లే రోడ్డు పక్కన చెత్తను పడేస్తున్నారు. ఎంపల్లి, చోర్‌గావ్, తాడిహత్నూర్, నాగల్‌కొండ, కొత్తపల్లి -హెచ్, మహాగావ్, సోనాపూర్ తదితర గ్రామ పంచాయతీలకు సంబంధించిన డంపింగ్ యార్డులు గ్రామానికి దూరంగా ఉండడంతో వాటి పర్యవేక్షణ ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో తడి, పొడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

చర్యలు తీసుకుంటాం

గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా జరిగేలా చూస్తాం. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేర్వేరుగా డంపింగ్ యార్డుల్లో వేసేలా చర్యలు తీసుకుంటాం.

– జవహర్, ఎంపీడీవో, నార్నూర్

ఎంపీకి శుభాకాంక్షల వెల్లువ



ఎంపీని సన్మానిస్తున్న క్రీడా సంఘాల బాధ్యులు

ఆదిలాబాద్: కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీలో చోటు దక్కించుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను క్రీడా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సైతం ఎంపీని సన్మానించారు. కార్యక్రమాల్లో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, క్రీడా సంఘాల బాధ్యులు రఘుపతి, రాష్ట్ర పాల్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, బండారి వామన్, రవీందర్, రాజు ఉన్నారు.

విద్యార్థులు యాంటీడ్రగ్స్ సైనికులుగా మారాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని ఎంహెచ్‌ఆర్‌డీలో మాదకద్రవ్యాల నిర్మూలనపై శిక్షణ పొందిన ఉపాధ్యాయులు సురేశ్ మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు యాండీడ్రగ్స్ సోల్జర్‌గా మారాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలే పునాదులు



బేల: దండారీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: ఆదిలాబాద్ జిల్లా ప్రాంత అస్తిత్వానికి, జాతి గుర్తింపునకు సంస్కృతి, సంప్రదాయాలే పునాదులని ఆదిలాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మశాల(బి) గ్రామంలో దండారీ ఉత్సవాల్లో పాల్గొని, వాయిద్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు ఆదివాసులతో కలిసి గుస్సాడీ వేషధారణలో సంప్రదాయ నృత్యాలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, నాయకులు బోనిగిరివార్ గణేశ్, దేవ్‌రావు, మోరేశ్వర్, గంగాధర్, నవీన్, రాము, జీవన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ స్వామి జాతర సందర్భంగా మంగళవారం జైనథ్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారన్నారు. బీజేపీ నాయకులు ఆదినాథ్, రాందాస్, అశోక్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, ప్రతాప్, ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతీ దండారీకి రూ.15వేలు అందిస్తాం'



సాత్‌మేరిలో పూజలు చేస్తున్న బొజ్జు పటేల్

సిరికొండ: ప్రతీ గిరిజన గ్రామంలో నిర్వహించే దండారీకి ప్రభుత్వం తరఫున రూ.15 వేలు అందిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని సాత్‌మోరి, బోరింగ్ గూడ, సూర్యపేట్ గ్రామాల్లో దండారీ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవితాన్ని గడపాలి

ఆదిలాబాద్‌టౌన్: ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు ప్రశాంత జీవితాన్ని గడపాలని హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ బ్రహ్మకుమారి ప్రోగ్రాం ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మానసిక ప్రశాంతతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని, కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్, లెక్చరర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

బేల: రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేస్తోందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దండారీ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వడగూడ, మల్కుగూడ, రంభం, పోనాల, చంపెల్లి, చప్రాల, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆదివాసీ ఆరాధ్య దైవం, దండారీ వాయిద్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో పాటు దండారీ దీక్ష చేస్తున్న ఆదివాసీలకు కొత్త వస్త్రాలు అందజేశారు. పార్టీ జిల్లా నాయకులు సంతోష్, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, వైస్ చైర్మన్ విలాస్, మాజీ జెడ్పీటీసీ రాందాస్, ఆదిలాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, నాయకులు సుధాంరెడ్డి, వామన్, రాజు, శంకర్, హైమద్, చంద్రకాంత్, గులాబ్ పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు రమేశ్ రెడ్డి, ఉపాధ్యాయులు సంధ్య, రాజ్యలక్ష్మి, జ్యోతి, సులోచన, ప్రతిమ, సాధన, అరుణ, శైలజ, సరిత, సునిత, కవిత పాల్గొన్నారు.

పిప్పల్‌కోటి పాఠశాలలో..

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. అనంతరం భీంపూర్ మండల ఎంఈవో శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులకు బాలిక విద్య ఆత్మ రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆయుర్వేద మందులు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుర్వేద ఉచిత మెడికల్ క్యాంప్‌ను మంగళవారం రిమ్స్‌లోని గణేశ్ మందిర్‌లో నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయుష్ మెడికల్ అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ ఏటా ధనత్రయోదశి రోజున జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. మెడికల్ అధికారులు వాణి, దశరత్ పటేల్, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సిరికొండ: మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రాథోడ్ రెడ్డి కుటుంబాన్ని మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాకు చేరిన ప్రచార సామగ్రి

కైలాస్‌నగర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రచార సామగ్రి మంగళవారం జిల్లాకు చేరింది. గతనెల 30 నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా నవంబర్ 6న ముగియనుంది. దీనిపై పట్టభద్రులు, టీచర్లకు అవగాహన కల్పించేలా ముద్రించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్, కరపత్రాలను ఆలస్యంగా పంపించారు. పలు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది వాటిని తీసుకెళ్లారు. అయితే వాటిని ఏర్పాటు చేసేలోగానే నమోదు గడువు ముగిసే అవకాశం ఉండడంతో అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మాదకద్రవ్యాలతో ఆరోగ్యంపై ప్రభావం

ఆదిలాబాద్‌టౌన్: మాదకద్రవ్యాలతో విద్యార్థులు, యువత అనారోగ్యం బారిన పడతారని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం అన్నారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నెహ్రూ యువకేంద్రం, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో దివాళి విత్ మైభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో కలిసి పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ రఘు, లెక్చరర్లు కునాల్, గోపాల్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. ఒలింపియాడ్ పరీక్షల్లో రాణించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. నవీన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్